క్లుప్తంగా

చేతిరాత మెరుగుకు చర్యలు తీసుకోవాలి



నరసరావుపేట రూరల్: విద్యార్థుల చేతిరాత మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను డీఈవో చంద్రకళ ఆదేశించారు. యల్లమంద జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆమె సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు బోధన పట్ల ఆసక్తి పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రాతపరీక్ష, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి

నరసరావుపేట: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి శుక్రవారం ఉదయం 9.30గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం వద్దనున్న విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మొక్కలు పెంచాలంటూ విద్యార్థుల ప్రదర్శన

వినుకొండ(నూజెండ్ల): స్థానిక గీతాంజలి లీడ్ స్కూల్ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ డ్రైవ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పట్టణ పురవీధుల్లో మొక్కలను చేతబూని చేసిన ప్రదర్శన చూపరులను విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా చిన్నారులు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి భవిష్యత్ తరాలకు మంచిని చేకూర్చాలని, అలాగే ఎవరిని చెట్లను నరకకుండా వాటిని పెంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కరస్పాండెంట్ కిషోర్, డైరెక్టర్ శేషగిరిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూర్తి రాజపురంలో ఎరువులు సీజ్

వినుకొండ (నూజెండ్ల): ఎస్పీ రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు నూజెండ్ల మండలం మూర్తిజాపురం గ్రామంలో గల హరణి ఫెర్టిలైజర్స్ షాపులో రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా షాపులో ఉన్న పురుగుమందులు, ఎరువుల నిల్వలను, రిజిస్టర్లను, లైసెన్స్‌లను పరిశీలించారు. సరైన పత్రాలు చూపించనందును రూ.6.83 లక్షల విలువైన ఎరువులు సీజ్ చేసి ఉన్నారు. ఈ తనిఖీలో రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పి.శివాజీ, ఆదినారాయణ, నూజెండ్ల మండల వ్యవసాయాధికారి సుగుణాబేగం పాల్గొన్నారు.


ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

బొల్లాపల్లి: ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బొల్లాపల్లి, ఈపూరు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకులు (ఆయా) పోస్టులకు ఈ నెల 18వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో బి. అరుణ గురువారం తెలిపారు. బొల్లాపల్లి మండలంలో గుమ్మనంపాడు ఎస్సీ , కేసవాని పేట తండా ఎస్టీ, ఊడిజర్ల ఓసీ, ఈపూరు మండలంలో ఈపూరు మెయిన్ బీసీ-బీ, అంగలూరు ఎస్సీ, వనికుంట బీసీ-డి ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. స్థానిక వివాహిత మహిళ అయి ఉండి 21 నుంచి 35 సంవత్సరాల వయసు గలవారై 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. పాస్‌పోర్ట్ ఫోటో, విద్యార్హత పత్రాలు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు తదితర సంబంధిత పత్రాలను జత చేసి ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో అందజేయాలని వివరించారు. మరిన్ని వివరాలకు 9491051603ను సంప్రదించాలన్నారు.

మహంకాళి మాతకు రూ.8.13 లక్షల ఆదాయం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.8,13,981ల ఆదాయం లభించినట్టు ఈవో నలబోతు మాధవిదేవి తెలిపారు. ఆలయంలో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. నాలుగు నెలలకు హుండీల ద్వారా ఈ ఆదాయం లభించినట్టు ఈవో తెలిపారు. హుండీ లెక్కింపును ఇన్‌స్పెక్టర్ మంజూషా పర్యవేక్షించారు. విజయదుర్గర సేవా సమితి, ఆలయ సిబ్బంది, అర్చకస్వాములు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు ఏఎంజీ విద్యార్థి జాన్ ఫ్రెడ్డీపాల్



చిలకలూరిపేట: ఏఎంజీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి టి.జాన్ ఫ్రెడ్డీ పాల్ మార్టిన్ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 నెట్ బాల్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీలు పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో ఈ నెల 11 నుంచి 17 వరకు జరుగుతాయి. ఈ విద్యార్థిని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి అభినందించారు.

వరి దిగుబడిపై ఫెంగల్ ప్రభావం

ఈ ఏడు ధాన్యలక్ష్మి కరుణించింది.. పడిన శ్రమకు ఫలితం దక్కనుందని భావించిన రైతన్నను కుదేలు చేసింది ఫెంగల్ తుఫాన్. కోతకు సిద్ధమైన పంట అంతా తుఫాను గాలులకు నేలవాలిపోతే రైతన్న పొలంలో బిత్తర చూపులు తప్ప ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాడు. కనీసం ఉన్న పంటనైనా కాపాడుకుందామనే ప్రయత్నంలో ఆర్థికంగా భారమైనా నూతన వ్యవసాయ పరికరాలు తీసుకువచ్చి కుస్తీపడుతున్నాడు. పాపం సూర్యోదయ సూర్యాస్తమయాలన్నీ కర్షకులు పొలాల్లోనే గడుపుతున్నారు.



దాన్యాన్ని ట్రక్కుల్లో నింపుతున్న మిషన్



పండిన వరిని కోస్తున్న మిషన్

వర్షం కారణంగా పెరిగిన హార్వెస్టింగ్ ఖర్చులు

రొంపిచర్ల: ఇటీవల మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు ముదురు వరిపైరుపై ప్రభావం చూపింది. కోతకు సిద్ధమైన వరిపైరును వర్షం కారణంగా హార్వెస్టింగ్ చేయడం నిలుపుదల చేశారు. వర్షం వారం రోజుల పాటు కురుస్తుండటంతో వరి పంటను హార్వెస్టింగ్ చేయటం కుదరలేదు. హార్వెస్టింగ్ కు వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో వారం రోజుల పాటు పనులను రైతులు నిలుపదల చేసుకున్నారు. వారం రోజుల క్రితమే కోతకు సిద్ధమై నిలువు ఉన్న వరిపైరు వర్షం కారణంగా నేలవారింది. దీంతో ఎకరానికి 4 నుంచి 6 బస్తాల వరకు దిగుబడి తగ్గినట్లు రైతులు తెలుపుతున్నారు.

మండలంలోని కొన్ని గ్రామాల్లో బావులు, బోర్లు, చెరువులు, కుంటలు, వాగుల కింద వరినారును సాగు చేసి నాట్లు వేశారు. ముదురుగా మండలంలోని ఉత్తర దిక్కునున్న గ్రామాల్లో 2000కుపైగా ఎకరాల్లో ముదురు వరిపాగు చేశారు. ముదురు వరి సాగు చేసిన కొత్తపల్లి, చాకలికుంట తండా, ఎడ్వర్డ్‌పేట, వి.రెడ్డిపాలెం తదితర గ్రామా ల్లో నవంబర్ నెలలోనే వరిపైరు కోతకు సిద్ధమైంది. నవంబర్ ఆఖరి వారంలో ఆర్వెస్టింగ్ చేసిన వరి పంట దిగుబడి ఎకరాకు 35 బస్తాల వరకు వచ్చింది. బుధ, గురువారాల్లో వర్షం లేకపోవటంతో పొలాలు బురదగా ఉన్నా దిగుబడి నష్టం పెరుగుతుందని హార్వెస్టింగ్ ప్రారంభించారు. వరి కంకులు వర్షానికి నేలవాలటంతో హార్వెస్టింగ్ ఖర్చు కూడా పెరిగింది. ఈ పరిస్థితుల్లో నేలవారిని కంకుల నుంచి ధాన్యాన్ని తీసుకోవడం కష్టతరమైంది. హార్వెస్టింగ్ సమయంలో నేలవాలిన వరి కంకులన్నీ మిషన్‌కు అందక బురదపాలయ్యాయి. ధాన్యాన్ని పొలంలోనే నిల్వ ఉంచేందుకు అనుకూలత లేకపోవటంతో ట్రాక్టర్ ద్వారా గ్రామంలోనికి ధాన్యాన్ని తోలుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నవంబర్ నెలలో నిర్వహించిన హార్వెస్టింగ్‌లు 30 నుంచి 35 బస్తాల వరకు ధాన్యం దిగుబడి వచ్చింది. వర్షం కారణంగా నిలిచి పోయిన వరిపైరు 5 బస్తాల వరకు దిగుబడి తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు హార్వెస్టింగ్ ఖర్చు కూడా పెరిగింది. వారం రోజుల క్రితం హార్వెస్టింగ్ ఖర్చు ఎకరాకు రూ.2500కు మించలేదు. ప్రస్తుతం వరి హార్వెస్టింగ్‌కు అనుకూలంగా లేకపోవటంతో రూ.3500 నుంచి రూ.4000 వరకు ఖర్చు పెరిగింది. ఏదిఏమైనా వారం రోజుల పాటు కురిసిన ఫెంగల్ తుఫాన్ వర్షాలు ముదురు వరి రైతులను నష్టపరిచింది.

10 బస్తాల దిగుబడి తగ్గింది



ఎకరంపాతికలో వరిపైరు సాగు చేశా. పది రోజుల క్రితం వరి కోత కోయాల్సి ఉంది. వాతావరవరణం అనుకూలించక పోవటంతో వారం రోజుల పాటు హార్వెస్టింగ్ చేయటం వీలు పడలేదు. హార్వెస్టింగ్ చేయడం వీలు పడక ఖర్చు పెరిగింది. 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందనుకున్నా. నా పొలంలో 30 బస్తాలే వచ్చింది. 10 బస్తాల దిగుబడి తగ్గింది.

-ఏసోబు, రైతు, కొత్తపల్లి

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

బొల్లాపల్లి: మండలంలో ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ సుధాకర్ గురువారం తెలిపారు. ఈ సదస్సుల్లో భూ తగదాలు, ఎల్ఈసీ కార్డుల మంజూరు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు తదితర అంశాలపై ఈ సదస్సుల్లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ నెల 6న వడ్డెంగుంట, 10న కసుమలచెరువు, 11న వెల్లటూరు, 12న నాయుడుపాలెం, 13 పేరూరుపాడు, 17 బొల్లాపల్లి, 18 గుట్లపల్లి, 19 పలుకూరు, 20 రేమిడిచర్ల, 21 అయ్యన్నపాలెం, 26 రావులాపురం, 27 గండిగనుమల, 28 గరికపాడు, 30 చక్రాయపాలెం, 31 మేళ్లవాగు, జనవరి 3 గుమ్మనంపాడు, 4 వడ్డెంగుంట రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్, మండల సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, గ్రామ సర్వేయర్, వీఆర్ఏ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: శుక్రవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బండి నిర్మల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విప్పర్ల రెవెన్యూ గ్రామ సదస్సును విప్పర్ల గ్రామ సచివాలయంలో నిర్వహిస్తారు. 10వ తేదీన మాచవరం గ్రామ సదస్సు, 12న సంతగుడిపాడు, 13న ఆరేపల్లి, 17న దాసరి పాలెం, 19న రొంపిచర్ల, 21న నల్లగార్లపాడు, 24న అన్నవరం, 26న తురిమెళ్ల, 28న అన్నవరప్పాడు, 31న అలవాల, జనవరి 2వ తేదీన విప్పర్లపల్లి, జనవరి 4వ తేదీన గోగులపాడు గ్రామ సచివాలయాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దాసరిపాలెం గ్రామ రెవెన్యూ సదస్సును బుచ్చిబాపన్నపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తామన్నారు. భూములున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

నరసరావుపేట రూరల్: మండలంలో ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ కే.వేణుగోపాలరావు తెలిపారు. 6వ తేదీ దొండపాడు, 10వ తేదీ లింగంగుంట్ల, 11వ తేదీ కాకాని, 12వ తేదీ ములకలూరు, 13వ తేదీ ఇస్సప్పాలెం, 17వ తేదీ పెదరెడ్డిపాలెం, 18వ తేదీ పమిడిపాడు, 19వ తేదీ జొన్నలగడ్డ, 20వ తేదీ పెట్లూరివారిపాలెం, 21వ తేదీ ఉప్పలపాడు, 24వ తేదీ యల్లమంద, 26వ తేదీ గురవాయపాలెం, 27వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 1గంట వరకు చినతురకపాలెం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు గోనెపూడి, 28వ తేదీ కొండకావూరు, పమిడిమర్రు గ్రామాల్లో, 31వ తేదీ కేసానుపల్లి, కొత్తపాలెం, 2వ తేదీ రావిపాడు, 3వ తేదీ ఇక్కుర్రు, 4వ తేదీ అల్లూరివారిపాలెం, 7వ తేదీ పాలపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సభ నిర్వహించనున్నట్లు తహసిల్దార్ ఏవీ రమణ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి గ్రామ సభ ప్రారంభమౌతుందన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్, డీటీ, పంచాయతీ కార్యదర్శి, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్, వీఆర్వోతో పాటూ డిజిటల్ అసిస్టెంట్ హాజరౌతున్నట్లు తెలిపారు. గ్రామ సభలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరచి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

ఉపాధ్యాయుని హత్య హృదయ విదారకం

నరసరావుపేట ఈస్ట్: అన్నమయ్యజిల్లా రాయచోటి ప్రాంతంలోని కొత్తపల్లి జడ్పీ హైస్కూల్ ఉర్దూ భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎస్.ఏజాస్ అహ్మద్ హత్య హృదయవిదారకమని ఎస్టీయూ పల్నాడుజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.వి.రామిరెడ్డి, యు.చంద్రజిత్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అహ్మద్‌ను అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు దాడి చేసి హత్య చేశారన్న సంఘటనను సామాజిక మాధ్యమాల్లో చూసి తమ మనస్సు చలించిపోయిందన్నారు. గతంలో ఇటువంటి ఘటన రాష్ట్రంలో ఎక్కడా జరగలేదని, ఉపాధ్యాయలోకం ఒక్కసారిగా ఉలికిపాటు గురైందని తెలిపారు. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఉపాధ్యాయులకే రక్షణ లేకపోతే రాబోవు కాలంలో దేశం అంధకారంలోకి నెట్టివేయబడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను శిక్షించి అహ్మద్ కుటుంబానికి అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం

రొంపిచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎన్ ఆర్ ఇజీఎస్ ఏపీఓ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో గుర్తించిన పనులను ఆమోదించి కూలీలకు పనులు కల్పించాలన్నారు. అర్హులైన వారికి వెంటనే జాబ్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు సంవత్సరంలో 100 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన వారి పేర్లను ఉన్నతి యాప్‌లో నమోదు చేయాలన్నారు. సంవత్సరంలో వంద రోజులు పనులు చేసిన వారి కుటుంబ సభ్యులకు, వారిలో చదువుకున్న వారికి స్కిల్ డెవలప్మెంట్ పై అవగాహన కలిగించడమే ఉన్నతి స్కీం లక్ష్యమన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ మృతి చెందిన వారి పేర్లను కూడా నమోదు చేసి వారిని జాబ్ కార్డుల నుంచితొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

చిలకలూరిపేట: అర్హులైన నిరుపేదలందరికీ నివేశన స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు చెప్పారు. పట్టణంలోని 21,25 వార్డుల పరిధిలోని పేదలకు నివేశన స్థలాల కోసం గురువారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి, రూ. 5లక్షలు ఇంటి నిర్మాణానికి కేటాయించాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

ఒత్తిడికి గురిచేస్తున్న యాప్‌లు తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వినుకొండ(నూజెండ్ల): ఉపాధ్యాయులపై తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న యాప్‌లను తగ్గించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో నూజెండ్ల మండల విద్యాశాఖ అధికారి ఎస్. రవిచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 100రోజుల పదవ తరగతి షెడ్యూల్‌తో ఉపాధ్యాయులకు సంక్రాంతి సెలవు కుదించడం, ఆదివారాలను కూడా పని దినాలుగా మార్చడం, 10 శాతం సెలవుల పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. కార్యక్రమంలో డి. కోటేశ్వరరావు, సీహెచ్. మల్లికార్జునరావు, డి. అచ్యుత్‌కుమార్, టి. శ్రీనివాసరావు, యు. వెంకటేష్ తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంపును నిరసిస్తూ ఆందోళన



మాట్లాడుతున్న నాయకులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీలలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలతో పాటు విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళనలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎన్నికల హామీలో రాష్ట్రంలో విద్యుత్ చార్జీలపై పెంపుదల ఉండదని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే సామాన్యుడి నడ్డి విరిచేలా ఛార్జీలను పెంచుతున్నారని విమర్శించారు. కాగా, సిపిఐ పార్టీ శత వార్షిక ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈనెల 26వ తేదిన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, రొంపిచర్ల మండల కార్యదర్శి ఆర్.అంజిరెడ్డి, ఉప్పటపాటి రంగయ్య, షేక్. చినజాన్‌సైదా పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం విద్యార్థిని



శావల్యాపురం: జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం హైస్కూల్ ఇంటరు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆకుమళ్ళ సమీరా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 8వ ఫెడరేషన్ కప్ ఛాంపియన్‌షిప్ జాతీయ స్థాయి పోటీలు ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని కొడగు జిల్లా కుషాల్ నగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆకుమళ్ళ సమీరా పాల్గొంటుందన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో బాగా రాణించాలన్నారు. విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావన్‌కుమార్, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి అభినందించారు.

ఆరోపణలపై విచారణ

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్‌బెడ్స్ పనులు చేశామని ఇందుకు సంబంధించి ఉపాధి కూలీలు కొంత మందికి వేతనాలు మంజూరు చేయలేదని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. గురు వారం మతుకుమల్లి గ్రామ సచివాలయంలో జిల్లా ఉపాధి పీడీ మతం సిద్దాలింగమూర్తి సారథ్యంలో ఉపాధి నిధులు దుర్వినియోగం అయ్యాయని అంటూ ఉపాధి కూలీలు చేసిన ఆరోపణలపై క్షేత్ర స్థాయిలో అధికారులు విచారణ చేశారు. విచారణ చేసిన వారిలో సర్పంచ్ యలగాల బసవయ్య, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఏపీడీ బూసిరెడ్డి, ఏపీవో కె.రామారావు, ఉపాధి టీఏలు రోజారాణి, సుధాకర్, పాల్గొన్నారు.

18వ స్పోర్ట్స్ మీట్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో గల బాలాజీ ఐటీఐ కళాశాలలో సంకురాత్రి కృష్ణయ్య, గంగమ్మల జ్ఞాపకార్థంగా సంకురాత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 18వ స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- తప్పుడు కేసులకు భయపడాల్సిన పనిలేదు
- ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధం
- మాజీ మంత్రి విడదల రజిని



మాజీ మంత్రి విడదల రజినికి పుష్పగుచ్ఛం అందిస్తున్న స్థానిక నాయకులు

చిలకలూరిపేట: కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యాక పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న నివాసానికి గురువారం ఆమె విచ్చేసారు. ఈ సందర్భంగా పార్టీ వివిధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతనిధులు, కార్యకర్తలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ తప్పుడు కేసులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, ఎలాంటి సమస్యలు ఉన్నా పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వంపై ఆరు నెలల కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చటంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 11న రైతుల సమస్యలపై చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల ఓవరాక్షన్



మాజీ మంత్రి విడదల రజిని ఇంటి ఎదుట మఫ్టీలో పోలీసులు

సాక్షి, నరసరావుపేట: బీసీ మహిళ, మాజీ మంత్రి విడదల రజిని ఇంటి వద్ద పోలీసులు ఓవరాక్షన్ చేశారు. చిలకలూరిపేట పట్టణ, రూరల్ సీఐల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వచ్చిన పోలీసులు మాజీ మంత్రి ఇంటి చుట్టూ రోజంతా మోహరించి నానా హంగామా సృష్టించారు. అక్కడికి వచ్చిన కార్యకర్తలు, నాయకులను ఫొటోలు తీసి ఓవరాక్షన్ చేశారు. ఎందుకు ఇంత మంది ఉన్నారని వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రశ్నించగా సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఒకర్ని అరెస్ట్ చేయాలని, మాజీ మంత్రిని కలిసేందుకు వచ్చారన్న అనుమానంతో ఇక్కడ వేచి ఉన్నామని సమాధానమిచ్చారు. ఇప్పటికే చిలకలూరిపేట పోలీసుల తీరు వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే భార్య పుట్టినరోజు వేడుకలకు నియోజకవర్గంలోని పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున యూనిఫాంలో వెళ్లి కేక్ కట్ చేసి విమర్శపాలైన సంగతి పాఠకులకు తెలిసిందే.

ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

నోబుల్ టీచర్స్ రాష్ట్ర అదనపు కార్యదర్శి నాగేశ్వరరావు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: విద్యార్థుల దాడిలో మృతి చెందిన ఉపాధ్యాయుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నోబుల్ టీచర్స్ రాష్ట్ర అదనపు కార్యదర్శి బెజవాడ వెంకట నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో విద్యార్థుల దాడిలో మృతి చెందిన ఉపాధ్యాయుడు ఎస్.ఏజాజు అహ్మద్ మృతికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక మండల వనరుల కేంద్రంలో నిరసన కార్యక్రమం ఉపాధ్యాయులు గురువారం నిర్వహించారు

ఉపాధ్యాయుని మృతికి కారకులను శిక్షించాలి

నరసరావుపేట ఈస్ట్: రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్. ఇజాజ్ అహ్మద్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పల్నాడుజిల్లా ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఫ్యాప్టో నాయకులు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళను కలసి వినతి పత్రం అందించారు. , ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

కఠినంగా శిక్షించాలి

చిలకలూరిపేట: ఉపాధ్యాయుడి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు కోరారు. ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడటం మన అందరి బాధ్యత

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



భూసార పరీక్ష కార్డును రైతుకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డలో ప్రపంచ నేల దినోత్సవాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ మితిమీరిన ఎరువులు వినియోగం వలన భూసారం దెబ్బతింటుందని తెలిపారు. గతంలో సేంద్రియ పద్ధతిలోనే వ్యవసాయం చేసేవారని, అధిక దిగుబడుల పేరుతో రసాయన ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. దీనివల్ల భూసారం దెబ్బతినే పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల వలన కాలుష్యం పెరిగి పర్యావరణానికి పెనుప్రమాదంగా మారిందని తెలిపారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. నేలను సారవంతంగా ఉంచేందుకు సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని తెలిపారు. డీఏవో ఐ.మురళీ మాట్లాడుతూ రైతులు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగుమందులు వాడవద్దని తెలిపారు. అనంతరం రైతులకు భూసార పరీక్షల కార్డులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లపాటి రామచంద్ర ప్రసాద్, ఏడీఏ మస్తానమ్మ, డీడీఏ శివకుమారి, ఏపీఎంఐపీ పీడీ ఆంజనేయులు, ఎంపీడీవో కృష్ణకుమారి, ఏవో నరేంద్రబాబు పాల్గొన్నారు.

రేపు మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్



ఎస్సై లోకేశ్వరరావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7న జరగనున్న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఉన్న అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ చైర్మన్లు సారథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 01 వరకు సమావేశాలు ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా అలాగే పూర్వపు విద్యార్థులను ఆహ్వానించి పాఠశాలలు బలోపేతానికి కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను అందజేసి చిన్నారుల శక్తిసామర్థ్యాలను వివరించాలన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి ప్రత్యేకంగా ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావుకు పోలీసు స్టేషనులో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7న మెగా పేరెంట్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరా వు సందర్శించి మెగా పేరెంట్స్ సమావేశంపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించటమే మెగా పేరెంట్స్ సమావేశాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు.